

ముగిసిన బ్రహ్మోత్సవాలు

అలంపూర్ జోగులాంబ క్షేత్రంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

వివరాలు 8లో ▸



ఉద్యోగాలు వచ్చేనా.?

శ్రీశైలం నిర్వాసితులు జీఓ 98 ప్రకారం ఉద్యోగాలకు నోచుకోవడం లేదు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 32.4 /22.1

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ ప్రభావం ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్రం బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు అందజేయాలని.. పూర్తి వివరాలకు సెల్‌నంబర్ 98485 26708 సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో చాంపియన్‌గా నిలవాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా నిలవాలని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్ అడ్వకేట్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాకీర్ అడ్వకేట్ మాట్లాడుతూ సమష్టిగా ఆడితే విజయం సాధించవచ్చన్నారు. జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ వైఎంసీఏలో సోమ, మంగళవారాల్లో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు సుభాన్‌జీ, కార్యనిర్వాహక కార్యదర్శి మీర్ ఖాలెద్‌అలీ, సంయుక్త కార్యదర్శి మహ్మద్ ఇలియాజ్, సభ్యులు ఫారుఖ్ ముకర్రం, కోచ్ ఎండీ ఖలీల్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు..

పృథ్వీరాజ్, ఎంఏ రాశెద్, కె.ఉదయ్‌కుమార్, అజహర్ మహబూబ్‌ఖాన్, ఎండీ సయిద్‌అలీ, మహ్మద్ ఖాజా సల్మాన్, వి.కిరణ్‌కుమార్, అలీ అబ్దుల్ బాసిత్, జి.రోహిత్‌కుమార్, ఎండీ జకీ, రాం మనోహర్‌రెడ్డి, అబ్దుల్ రాఫే, కోచ్ ఫారుఖ్ ముకర్రం, మేనేజర్ మహ్మద్ ఇలియాజ్ తదితరులున్నారు.

21లోగా హజ్‌యాత్ర రుసుం చెల్లించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: హజ్‌యాత్రకు ఎంపికైన యాత్రికులు ఈ నెల 21వ తేదీలోగా మొదటి విడత రుసుం చెల్లించాలని జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ అహ్మద్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని హజ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రికులు మొదటి మొదటిగా రూ. 1,30,300 ఎస్‌బీఐ లేదా యూనియన్ బ్యాంకులో డీడీ తీసి.. రాష్ట్ర హజ్ కమిటీకి 23వ తేదీలోగా అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు హజ్ సొసైటీ బాధ్యులను సంప్రదించాలని కోరారు. సొసైటీ కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం, అబ్దుల్ హజ్, వకీల్ మౌలానా, నూరుల్ హక్, మహమ్మద్ ఎజాస్ నక్షబందీ, మహమ్మద్ అమీద్, మహమ్మద్ సలీం ఉన్నారు.



పేటలో బారంబావి వద్ద రాంలీల మైదానంలో రావణదహనం



జిల్లా కేంద్రంలో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న జనం

దసరా వైభవం

ఊరూరా అంబరాన్నంటిన విజయదశమి సంబరాలు

- ఆలయాలు, జమ్మిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు
- పేట ఆర్యసమాజ్, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు
- రాంలీల మైదానంలో సభ, రావణ దహనం
- సనాతన ధర్మమే భారతదేశం : వేడుకల్లో శివానందస్వామి



నారాయణపేట/నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా దసరా వేడుకలను శనివారం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఆయుధపూజ, జమ్మి ఇచ్చి పుచ్చుకొని ఒకరి కొకరు శుభాకాంక్షలు తెలి పారు. ఇంటిల్లిపాది ఒక్కచోటకు చేరి.. కబుర్లు.. పిండివంటల ఘుమఘుమలతో ప్రతి ఇంట్లో పండగ శోభ కొట్టొచ్చింది. జిల్లా కేంద్రంలోని బారంబావి దగ్గర ఆర్యసమాజ్, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, నగర ఉత్సవ సమితి, విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. అలాగే, ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. పట్టణంలోని శ్రీరాఘవేంద్ర స్వామి, శ్రీ బాలాజీ మందిర్, అంబభవానీ, మర్గమ్మ మందిర్, చౌడేశ్వరి, శ్రీ పాండురంగస్వామి, శక్తిపీఠం ఆలయాలతో పాటు పట్టణ శివారులోని ఎక్లాస్‌పూర్ బాలాజీ, లోకాయపల్లి లక్ష్మమ్మ, కర్ణాటక రాష్ట్రంలోని యానగుంది మాణిక్యగిరిలో కొలువుదీరినా వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

బహిరంగసభకు అశేష జనవాహిని

జిల్లా కేంద్రంలోని బారంబావి దగ్గరలోని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా శివానంద స్వామితో పాటు వివిధ స్వర్ధల నాయకులు హాజరై హైందవ సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు దసరా విశిష్టతను వివరించారు. అంతకుముందు ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు విశ్వనాథ్ ఆర్యసమాజంలో పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ధ్వజారోహణను మున్సిపల్ వైస్ చైర్మన్ హరి నారాయణ్ బట్టడ్ డాక్టర్ విశ్వనాథ్‌కు ఓంకారం జెండాను అందించగా.. పురవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. జమ్మి కొమ్మలను తీసుకువచ్చి బారంబావి దగ్గర ప్రత్యేక పూజలుచేశారు. ఆ తర్వాత రావణ దహన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతం ఒకరికొకరు జమ్మిని పంచుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



కోస్గిలో అమ్మవారి నిమజ్జనోత్సవంలో మహిళలు, చిన్నారుల నృత్యాలు

శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు

పట్టణం, మండలంలోని కోటకొండ, కొల్లంపల్లి, జాజాపూర్ తదితర గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో కొలువైన జమ్మి వృక్షానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. విజయదశమిని పురస్కరించుకుని షమీ వృక్షానికి పూజలు చేసి జమ్మి ఆకులను ఇంటికి తీసుకువెళ్లి సాయంత్రం వేళలో ఒకరికొకరు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అదే విధంగా ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రీసరస్వతి శిశుమందిర్‌లో, జాజాపూర్ జెడ్పీ స్కూల్ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.



జమ్మికి పూజ చేస్తున్న ఎస్ఎస్‌కే సమాజ్ బృందం

సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నం..

అంతకు ముందు శివానంద స్వామి మాట్లాడుతూ.. వినాయక మంటపాలు, బతుకమ్మ సంబరాలు, దసరా ఉత్సవాలు.. ఏ పండుగైనా సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నంగా ఉండాలన్నారు. ఎన్నో దశాబ్దాల కల అయిన అయోధ్య రామమందిర నిర్మాణం నేడు నెరవేరిందంటే అదే సనాతన ధర్మమన్నారు. ఈ రోజు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో ఉత్సవాలు జరుపుకొంటున్నమన్నారు. నాటి కాలంలో చత్రపతి శివాజీ కాలుమోపిన నేల నారాయణపేట అన్నారు. ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు రతంగ్‌పాండురెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, విహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, గణేశ్, దసరా ఉత్సవ నాయకులు పాల్గొన్నారు.



పేటలో దసరా ఉత్సవాల్లో ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న స్వామి శివానంద..



డాక్టర్ విశ్వనాథ్‌కు ఓంకారం జెండా అందిస్తున్న హరి నారాయణ్

పులకించిన కొండారెడ్డిపల్లి



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు

- సంప్రదాయ నృత్యాలు, బతుకమ్మలతో ఆహ్వానం
- పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు, అభిమానులు
- రూ.70 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

వంగూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారిగా తన స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి వచ్చిన రేవంత్‌రెడ్డికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. దసరా ఉత్సవాలకు సీఎం రాకతో పులకించిపోయారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి హెలీకాప్టర్‌లో కొండారెడ్డిపల్లికి చేరుకున్నారు. ఆయనకు స్వాగతం పలికేందుకు కొండారెడ్డిపల్లి గ్రామస్తులతోపాటు వంగూరు మండలంలోని పలు గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. కోలాటాలు, బతుకమ్మ, దాండియా నృత్యాలతో ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. పూలవర్షం కురిపించారు. సీఎం వచ్చీ రాగానే గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. నూతన పంచాయతీ భవనం, పశువైద్యశాల, గ్రంథాలయం, ఎస్సీ, బీసీ కమ్యూనిటీ హాళ్ల ప్రారంభోత్సవంతోపాటు పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన ఇంటింటికీ ఉచిత సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ రోడ్లు, బస్టాండ్, ఓపెన్ జిమ్, పార్కు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా చేపట్టిన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో నాలుగు వరుసల రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, పాలశీతలీకరణ కేంద్రం నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.70 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.



బతుకమ్మ, కోలాటంతో సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

భాజాభజంత్రీలతో జమ్మికి..

సాయంత్రం 6.30 గంటల సమయంలో భాజాభజంత్రీలు, సంప్రదాయ నృత్యాల నడుమ కుటుంబ సభ్యులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి జమ్మి పూజకు వెళ్లారు. ఇంటి నుంచి కాలినడకన గ్రామ శివారులోని జమ్మిచెట్టు వద్దకు చేరుకుని తన మనువడిని ఎత్తుకుని జమ్మిపూజ చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. అక్కడి నుంచి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులను ఆప్యాయంగా పలకరిస్తూ, ఫొటోలు దిగారు. రాత్రి 8.30 గంటల ప్రాంతంలో రోడ్డు మార్గాన కొడంగల్‌కు బయల్దేరారు. కార్యక్రమంలో కలెక్టర్ బదావత్ సంతోష్, జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, జి.మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీఎన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పండిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పలుమార్లు కొండారెడ్డిపల్లి గ్రామానికి వచ్చి.. అభివృద్ధి పనులు, బందోబస్తు చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి..

అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సీఎం నివాసంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వంశీకృష్ణతో అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. వీలైతే వచ్చే నెలలో కొండారెడ్డిపల్లికి రావడంతోపాటు అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన చేస్తానని చెప్పారు. అప్పటి వరకు నియోజవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులపై ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు. విద్య, వైద్యం, ఇరిగేషన్, ఉపాధి కల్పనలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.80.14 కోట్ల మద్యం అమ్మకాలు

- ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం
- కిటకిటలాడిన మటన్, చికెన్ దుకాణాలు

కిక్కే.. కిక్కు



మహబూబ్‌నగర్ క్రైం: దసరా పండగ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాలు భారీగా జరిగాయి. ఈసారి కర్రీ పండగ ఆదివారం రావడం మద్యం ప్రియులకు మరింత జోష్ పెంచింది. దీంతో రెట్టింపు మద్యం విక్రయాలు జరిగాయి. మూడు రోజుల వ్యవధిలో ఉమ్మడి జిల్లాలోని 230 మద్యం దుకాణాల పరిధిలో రూ.80.14 కోట్ల విక్రయాలు జరిగాయి. ప్రధానంగా మూడు రోజుల నుంచే మద్యం దుకాణాల ఎదుట మందుబాబులు క్యూ కట్టారు. మద్యం అమ్మకాలతో ప్రభుత్వానికి ఉమ్మడి జిల్లా నుంచి భారీ ఆదాయం లభించింది. దసరా పండగ సందర్భంగా నాలుగు రోజుల ముందే మద్యం వ్యాపారులు తిమ్మాజిపేట, కొత్తకోట దగ్గర ఉన్న డిపోల నుంచి పెద్దఎత్తున మద్యం కొనుగోలు చేశారు.

టార్గెట్ రీచ్‌పై దృష్టి

విజయ దశమి సందర్భంగా బీరు, విస్కీ అమ్మకాలు అధికంగా జరిగాయి. ఈసారి ఎక్సైజ్ అధికారులు టార్గెట్ రీచ్ కావడానికి విస్తృతంగా సేల్ చేయడంపై దృష్టిపెట్టారు. సంబంధిత అధికారుల అంచనా ప్రకారం వీటి అమ్మకాలపై సర్కారుకు 20 శాతం లాభం ఉంటుంది. రెండు డిపోల పరిధిలో ప్రతి నెల రూ.200కోట్ల వ్యాపారం కొనసాగుతోంది. కొందరు ఎక్సైజ్ అధికారులు తమ టార్గెట్ కోసం బెల్ట్ దుకాణాలను ప్రోత్సహిస్తున్నారు. మారుమూల పల్లెల్లోనూ మద్యం అందుబాటులో ఉంచుతుండటంతో రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం లభిస్తుంది.

కిక్కిరిసిన మాంసం దుకాణాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మటన్, చికెన్ దుకాణాలు ఆదివారం కిటకిటలాడాయి. పట్టణాలతోపాటు పల్లెలో సైతం రద్దీగా కనిపించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలుదారులతో సందడిగా ఉన్నాయి. ప్రధానంగా పాలమూరులో పట్టణంలో ఉన్న మటన్ దుకాణాల దగ్గర క్యూ కట్టారు. ఈ ఒక్కరోజు ఉమ్మడి జిల్లావ్యాప్తం మటన్, చికెన్ కలిపి దాదాపు వెయ్యి క్వింటాళ్ల వరకు విక్రయాలు జరిగాయని అంచనా.

మొదటిస్థానంలో మహబూబ్‌నగర్..

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా మద్యం అమ్మకాలు జరుగుతున్న ప్రాంతాలుగా మొదటి స్థానంలో మహబూబ్‌నగర్ ఉండగా రెండో స్థానంలో నాగర్‌కర్నూల్ పట్టణం ఉంది. ఆ తర్వాత జడ్చర్ల, గద్వాల, కొత్తకోట ప్రాంతాల్లో మద్యం అధిక సంఖ్యలో అమ్మకాలు జరుగుతున్నాయి. ఇలాంటి కొన్ని ముఖ్య కేంద్రాల్లో ఉన్న డిమాండ్ కలిగిన మద్యం దుకాణాల నుంచి అధిక సంఖ్యలో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వచ్చింది. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్‌లో 90, నాగర్‌కర్నూల్ జిల్లాలో 67, వనపర్తిలో 37, గద్వాలలో 36 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో కొన్ని ముఖ్య సెంటర్లలో ఉన్న దుకాణాల్లో మద్యం అమ్మకాలు భారీగా జరిగాయి.

రూ.వంద కోట్లపైనే విక్రయాలు

ఉమ్మడి జిల్లాలో దసరా పండగ నేపథ్యంలో ఎలక్ట్రానిక్ వస్తువులతోపాటు షాపింగ్స్, ఇతర క్రయ విక్రయాలు జోరుగా జరిగాయి. అన్ని రకాల వ్యాపార సముదాయాల్లో దాదాపు రూ.వంద కోట్లకుపైనే వ్యాపారం జరిగి ఉంటుందని అంచనా. ప్రధానంగా దసరాకు పలు షోరూంల నిర్వాహకులు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు అధికంగా కొనుగోలు చేయడం జరిగింది. వీటితోపాటు సెల్‌ఫోన్స్, టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు భారీగా అమ్మకాలు జరిగాయి. ఇక షాపింగ్ మాల్స్, చిన్నపాటి మేన్స్‌వేర్, ఇతర వస్త్ర దుకాణాలు అయితే వారం రోజుల నుంచే రద్దీగా కనిపించాయి.

సమగ్ర సర్వేతోనే..

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు
- కొత్త ఆర్వోఆర్- 2024 చట్టంతో ఫలితాలపై సమాలోచన
- క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ సైతం పూర్తి
- సర్వే నంబర్ల వారీగా హద్దులు గుర్తిస్తేనే ప్రయోజనం
- ఇప్పటికైనా ఇబ్బందులు తొలగుతాయని రైతన్నల్లో ఆశలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: భూ సమస్యల పరిష్కారం కోసం ఎన్ని చట్టాలు తెచ్చినా భూ రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. క్షేత్రస్థాయిలో గెట్టు పంచాయితీలు, హద్దు గొడవలతో భూ యజమానులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినా అవి రికార్డులకే పరిమితమయ్యాయి. భూప్రక్షాళనతోపాటు తహసీల్దార్ కార్యాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు, వెంటనే ముటేషన్లు, కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ వంటివి చేపడుతూ ధరణి పోర్టల్ ద్వారా భూ రికార్డులను ఆన్‌లైన్‌లోకి తెచ్చింది. అయితే క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారం దొరకలేదు. సర్వే సమస్యలతో సతమతమవుతున్న బాధిత రైతులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. పలుమార్లు సమావేశమైన సబ్‌కమిటీ సభ్యులు ధరణితోపాటు క్షేత్రస్థాయి సమస్యలపై ఉన్నతాధికారుల ద్వారా పూర్తి నివేదిక పరిశీలించి.. నూతన ఆర్వోఆర్- 2024 చట్టానికి రూపకల్పన చేసి ప్రజాభిప్రాయ సేకరణ సైతం పూర్తి చేశారు. ఆర్వోఆర్ రికార్డులతోపాటు క్షేత్రస్థాయి భూ సమస్యలను పరిష్కరిస్తేనే రైతులకు మేలు జరుగుతుందనే అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర భూ సర్వేనే అంతిమ పరిష్కారం అని సబ్‌కమిటీ తేల్చినట్లు తెలుస్తోంది.

హద్దులు, మ్యాపులు..

నిజాం సర్కార్‌లో రూపొందించిన సర్వే మ్యాపుల ద్వారానే ఇప్పటికీ ల్యాండ్ సర్వే నిర్వహిస్తున్నారు. అప్పట్లో మ్యాపుల్లో పొందుపర్చిన నంబర్లు, వివరాలు ఇతర భాషల్లో ఉండటంతోపాటు అక్యూరేట్ కొలతలు లేకపోవడం కూడా ప్రస్తుత సమస్యలకు కారణవుతోంది. సేత్వార్‌లో నమోదైన భూ విస్తీర్ణానికి క్షేత్రస్థాయిలో ఉన్న దానికి వ్యత్యాసం ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో గ్రామాల్లో వివాదాలు తలెత్తి గొడవలు జరుగుతున్నాయి.

ఇబ్బందులకు తావు లేకుండా

భూ సమగ్ర సర్వే ద్వారా రైతులకు ఇబ్బందులు తప్పి ఎంతో మేలు జరిగే అవకాశముంది.



చిన్నదర్పల్లిలో సర్వే నం.41లో మ్యాపులు పరిశీలిస్తున్న సర్వే ల్యాండ్ అధికారులు (ఫైల్)

ప్రభుత్వ కొలతల రికార్డులు సైతం పక్కాగా నమోదు కానున్నాయి. సర్వే నంబర్ల వారీగా హద్దులు నిర్ణయించడం వల్ల వాస్తవ విస్తీర్ణం, నక్షాలు రూపొందించి భూ కొనుగోలు, అమ్మకాల్లో పారదర్శకత ఏర్పడుతుంది. సర్వే నంబరు వాస్తవ విస్తీర్ణం ఆధారంగా పట్టాదారుల విస్తీర్ణం తేల్చే అవకాశముంది. కబ్జాలు, హద్దుల గొడవలు, సర్వే నంబర్ల సమస్యలన్నీ పరిష్కారం కానున్నాయి.

హద్దు రాళ్ల జియోట్యాగింగ్

సమగ్ర భూ సర్వే చేపడితే సర్వే నంబర్ల వారీగా హద్దులు నిర్ణయించడంతోపాటు జియో ట్యాగింగ్ చేస్తారు. సర్వే నంబర్ల జియో ట్యాగింగ్ చేయడం ద్వారా వాస్తవంగా ఎంత భూ విస్తీర్ణం అందుబాటులో ఉందనేది తెలుస్తోంది. అలాగే సర్వే నంబర్ల వారిగా భూములు ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయడం వల్ల ఎప్పటికప్పుడు ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుంది. గతంలో ప్రభుత్వ భవనాలు, ఇతర కార్యక్రమాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని సూచిస్తే ఆయా మండలాల్లో ఎక్కడ అందుబాటులో ఉందనేది సులువుగా గుర్తించవచ్చు.

మ్యాపులు లేవు



సబ్‌డివిజన్ మ్యాపులు అందుబాటులో లేకపోవడం కారణంగా కొలతలు సాధ్యపడటం లేదు. సబ్‌డివిజన్ కొలతలే ప్రధాన సమస్యగా మారుతోంది. దీనిపైనే ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయి. సమగ్ర భూ సర్వే చేస్తే సర్వే నంబర్ల వారిగా పక్కాగా హద్దులు ఏర్పడుతాయి. భూ సమస్యలు తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

– కిషన్‌రావు, సర్వే ల్యాండ్ ఏడీ

ముగిసిన జోగుళాంబ బ్రహ్మోత్సవాలు

- ధ్వజ అవరోహణం, పూర్ణాహుతితో పరిసమాప్తం.. తీర్థావళి పేరిట నదిలో దేవతామూర్తులకు పుణ్యస్నానాలు
- ఇంద్రకీలాద్రిని తలపించిన తెప్పోత్సవం
- ఆలయాలను దర్శించుకున్న డీజీపీ, ఐజీ, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే


యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం విజయదశమితో ముగిశాయి. 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు అమ్మవారిని శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయిని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రిగా అలంకరించి ఆరాధించారు. సాధారణ భక్తులేగాక పలువురు సినీ, రాజకీయ ప్రముకులు, ఉన్నతాధికారులు ఉత్సవాలకు హాజరై పూజల్లో పాల్గొన్నారు.

పూర్ణాహుతితో పరిసమాప్తం..

అమ్మవారి యాగశాలలో విజయదశమి రోజున ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వరరెడ్డి, ధర్మకర్తలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగశిరోమణి, పులేందర్, జగదీశ్వర్‌గౌడ్, మాలధారులు పూర్ణాహుతి సమర్పించి యాగాన్ని పరిసమాప్తి చేశారు.

ఖడ్గానికి ఆయుధపూజ..

తరతరాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం 7వ శతాబ్దం రాజుల కాలం నుంచి వస్తున్న ఖడ్గానికి పూజలు చేశారు. ఖడ్గాన్ని దేవతామూర్తుల పాదాల వద్ద ఉంచి షోడశోపచార పూజలతో శమీ(జమ్మి) పత్రాన్ని ఈఓతో కోయించారు. అనంతరం జమ్మి పత్రాన్ని భగవంతుడికి అందజేశారు.

ప్రముఖుల హాజరు..

పండుగ రోజున ఆలయానికి డీజీపీ జితేందర్, ఐజీ రమేష్‌రెడ్డి, కలెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విజయుడు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి దశవిధ హారతులను తిలకించి పల్లకీలో దేవతామూర్తుల విగ్రహాలను పుష్కరఘాట్‌కు చేర్చారు. డీజీపీ, ఐజీ దంపతులకు చైర్మన్, ఈఓ అమ్మవారి జ్ఞాపికను అందజేసి శేషవస్త్రంతో సన్మానించారు.

తీర్థావళితో పుణ్యస్నానం..

మూడు ప్రధాన కలశాలను ఉద్యాపన చేసి ఉత్సవ బలిభేరి, దేవతామూర్తుల విగ్రహాలను ఊరేగింపుగా తుంగభద్ర నదికి చేర్చారు. ఈ సమయంలో ఒకరిపై ఒకరు రంగునీరు చల్లుకుంటూ వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలకు మూడు కలశాల్లోని పుణ్యజలాలు, పంచామృతాలతో అభిషేకించారు. విగ్రహాలను నదిలో ముంచి ఆపై భక్తులు కూడా అక్కడే పుణ్యస్నానాలు ఆచరించారు.

బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.31,67,824

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రూ.31,67,824 ఆదాయం సమకూరినట్లు ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. ఆదివారం చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గతేడాది రూ.30,07,460 ఆదాయం సమకూరిందని.. ఈసారి భక్తులు అధికంగా రావడంతో ఆదాయం కూడా పెరిగిందని వివరించారు. ప్రచారం, ఏర్పాట్లు, వసతికల్పనతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ శక్తికి మంచి పని చేశారని కొనియాడారు. ఉత్సవాల విజయవంతానికి సహకరించిన పోలీసు, వైద్య, ఆరోగ్య, ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం

జోగుళాంబ అమ్మవారి తెప్పోత్సవాన్ని ఇంద్రకీలాద్రిని తలపించేలా నేత్రపర్వంగా నిర్వహించారు. హంసవాహనంపై దేవతామూర్తుల విగ్రహాలు ఉంచి జలవిహారం చేయించారు. నది తీరం నుంచి దశవిధ హారతులిచ్చారు. ఆ సమయంలో బైరోజు రాజశేఖర్ ప్రవచనాలు మంత్ర ముగ్దులను చేసింది. కలెక్టర్ సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే విజయుడు, ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తెప్పోత్సవంలో పాల్గొన్నారు. వేడుకను చూసేందుకు వచ్చిన వారితో పుష్కరఘాట్ కిటకిటలాడింది. అనంతరం ధ్వజ అవరోహణం చేసి ఈఓ అందరికి కృతజ్ఞతలు చెప్పడంతో కార్యక్రమం ముగిసింది.

వయోలిన్‌తో అన్నమాచార్య కీర్తనలు..

వేములవాడకు చెందిన వినయ్‌కృష్ణ ఆదివారం అలంపూర్ ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నంది మండపంలో భగవంతుడి ముందు వయోలిన్ వాయించి భక్తులను అలరింపజేశారు.


తెప్పోత్సవంలో పూజలు చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే


నదిహారతులు ఇస్తున్న అర్చకులు


తుంగభద్ర నదిలో తీర్థావళి

మూడు దశాబ్దాలుగా కలగానే..!


బాదేపల్లిలో టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణానికి కేటాయించిన స్థలం

జడ్చర్లలో నిర్మాణానికి నోచుకోని టీటీడీ కల్యాణ మండపం

- అప్పట్లో వైఎస్‌ఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన
- చొరవ చూపిన ఎంపీ మల్లు రవి
- నేటికీ ముందుకు సాగని వైనం


స్థలాన్ని పరిశీలిస్తున్న టీటీడీ ఇంజినీరింగ్ అధికారులు, పుర ప్రముఖులు (ఫైల్)

జడ్చర్ల: పట్టణంలో తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండప నిర్మాణానికి దశాబ్దాలుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. సుమారు 30 ఏళ్లుగా నాయకులు, పట్టణవాసులు అలుపెరుగని రీతిలో కృషి చేస్తున్నారు.

ఇదీ నేపథ్యం..

1993–94లో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి గుబ్బ విశ్వనాథం అధ్యక్షతన ఓ కమిటీ ఏర్పాటు చేశారు. 1998లో స్థానిక వేంకటేశ్వరకాలనీ సమీపంలోని సర్వేనంబర్ 110, 111లో 1.35 ఎకరాల స్థలాన్ని కేటాయించి రిజిస్ట్రేషన్ కూడా చేశారు. నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని టీటీడీని కోరగా రూ.18 లక్షలు మంజూరు చేశారు. ప్రజల భాగస్వామ్యం కింద 10 శాతం వాటాగా రూ.1.80 లక్షలను విరాళాలుగా సేకరించి టీటీడీకి అందజేశారు. అనంతరం మండపం అంచనా వ్యయం రూ.22.50 లక్షలకు పెంచారు. దీంతో కంట్రిబ్యూషన్ ఫండ్ కింద మరో రూ.45 వేలు చెల్లించారు. అనంతరం నిర్మాణంలో కాలయాపన జరగడంతో దశల వారీగా అంచనా వ్యయం రూ.33 లక్షలు, రూ.54 లక్షలకు పెరిగింది. దీంతో 10 శాతం వాటా చెల్లిస్తూ వచ్చారు. ఇలా సంవత్సరాల తరబడి కొనసాగింది. 2009లో ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అప్పటి ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మండప నిర్మాణానికి రూ.79 లక్షలు కేటాయించి శంకుస్థాపన కూడా చేశారు. అనంతరం పనులు చేపట్టకపోవడంతో నిర్మాణం కథ కంచికి చేరింది. 2012లో మరోమారు మల్లు రవి సమస్యను టీటీడీ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు చేపట్టాలని కోరారు. ఇందుకు స్పందించిన టీటీడీ బోర్డు మండపం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ అప్పట్లో ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇందుకు రూ.90 లక్షలు కూడా మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందులో 10 శాతం కంట్రిబ్యూషన్ ఫండ్ రూ.9 లక్షలు చెల్లించాల్సి ఉండింది. గతంలోనే రూ.5.40 లక్షలు చెల్లించామని.. వెనుకబడిన ప్రాంతంగా విన్నవించి పాత నిబంధనల మేరకే నిర్మాణం చేపట్టాలని, మిగతా కంట్రిబ్యూషన్ మొత్తాన్ని కూడా టీటీడీ బోర్డు భరించి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయగా అంగీకారం తెలిపిందని అప్పట్లో మల్లు రవి ప్రకటించారు.

టీటీడీ అధికారులకు విన్నవించాం..



మండపం నిర్మించాలని టీటీడీ ఈఓ, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులకు వినతులు అందజేశాం. వారి నుంచి సానుకూల స్పందన వచ్చింది. కళ్యాణ మండపం నిర్మిస్తే ప్రజలందరికి సౌకర్యంగా ఉంటుంది. అధికారులు, పాలకులు ఆ దిశగా చర్యలు చేపట్టాలి.
– అనిల్‌కుమార్, సామాజికవేత్త, బాదేపల్లి

పేదలకు ఉపయోగం..



టీటీడీ కల్యాణ మండపం నిర్మిస్తే పేద ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ చిన్న శుభకార్యం చేయాలన్నా ఫంక్షన్‌హాల్ తీసుకోవాల్సి వస్తుంది. ధరలు అధికంగా ఉండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కళ్యాణ మండపం నిర్మించి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా కృషి చేయాలి. – బి.మహిపాల్‌రెడ్డి, బాదేపల్లి

ఉన్నతాధికారులకు నివేదించాం..

టీటీడీ కల్యాణ మండపం ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని సర్వే చేసి స్వాధీనం చేసుకొని కంచె, బోర్డు ఏర్పాటు చేశాం. ఉన్నతాధికారులకు పూర్తి నివేదిక అందజేశాం. వారి అనుమతి లేకుండా ఏ విషయాన్ని తాము చెప్పలేం.
– నాగరాజు, డీఈఈ, టీటీడీ, తిరుపతి

మళ్లీ తెరపైకి..

మండపాన్ని నిర్మించకపోవడంతో పుర అధికారులు ఆ స్థలాన్ని రెండేళ్ల కిందట పార్క్‌గా మార్చేందుకు ప్రయత్నించారు. దీంతో పట్టణవాసులు అడ్డుకొని టీటీడీ అధికారులకు విన్నవించడంతో వారి నుంచి సానుకూల స్పందన వచ్చింది. కల్యాణ మండపం నిర్మించేందుకు కృషి చేస్తామని పేర్కొంటూ దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకొని అక్కడ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ ప్రత్యేక చొరవ తీసుకొని మండప నిర్మాణం చేపట్టేలా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


జానకిరాములు (ఫైల్)

లింగాల: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందిన ఘటన శనివారం మండలంలోని పద్మన్నపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రైతు జానకిరాములు (62) తన సొంత పొలంలో మొక్కజొన్న సాగు చేశాడు. పంటను పందుల బెడద నుంచి రక్షించుకోవడానికి చుట్టూ విద్యుత్ తీగను ఏర్పాటు చేశాడు. శుక్రవారం రాత్రి పంట కాపలాకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు తీగ కాలికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మరుసటి రోజు ఉదయం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలానికి వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించాడు. జానకిరాములుకు భార్య కృష్ణమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ..

వనపర్తి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శ్రీ రంగాపురం మండలంలోని కంబాళాపురం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ కథనం ప్రకారం.. పాన్‌గల్ మండలం, బహదూర్‌గుడెంకు చెందిన సత్తూర్ భాస్కర్‌గౌడ్ (50) గీత కార్మికుడుగా జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సత్తూర్ బైక్‌పై రాయిన్‌పల్లిలో బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి శ్రీ రంగాపురం నుంచి పెబ్బేరు వైపు వెళ్తుండగా కంబాళాపురం శివారులో బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీ కొన్నాడు. దీంతో అతడి తలకు బలమైన రక్త గాయాలు అయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. అతడి కుమారుడు ఉదయ్‌కుమార్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరు..

కొల్లాపూర్ రూరల్: చింతలపల్లి గ్రామానికి చెందిన కాశీం హరికృష్ణ (21) బైక్ అదుపు తప్పి కిందపడడంతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం ఉదయం ఎన్మన్‌బెట్లలో ద్విచక్ర వాహనం రిపేరు చేయించడానికి వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది. మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి కిందపడడంతో హరికృష్ణ తలకు, ఇతర భాగాలలో తీవ్రంగా గాయాలు అయ్యాయి. దీంతో వెంటనే కొల్లాపూర్‌లో ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడని స్థానికులు పేర్కొన్నారు. హరికృష్ణ కొల్లాపూర్‌లో హోండా షోరూంలో పని చేసేవాడని వివరించారు.

కేఎల్ఐ కాల్వలో వాహనం బోల్తా..


కేఎల్‌ఐ కాల్వలో పడిన వాహనం ఇదే..


బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

- మహిళా కూలీ మృతి
- మరో పదిమందికి గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం : ప్రమాదవశాత్తు బొలేరో వాహనం కేఎల్‌ఐ కాల్వలోకి దూసుకెళ్లి బోల్తాపడడంతో మహిళా కూలీ అక్కడికక్కడే మృతిచెందిన ఘటన జిల్లాకేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం ప్రకారం.. మంతటి గ్రామానికి చెందిన సయ్యద్ తన బొలేరో వాహనంలో పత్తి ఏరేందుకు కూలీలను జిల్లా కేంద్రానికి తీసుకువస్తుండగా.. ప్రమాదవశాత్తు వాహనం కేఎల్‌ఐ కాల్వలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో గ్రామానికి చెందిన మహ్మదా బేగం (45) అక్కడికక్కడే మృతిచెందింది. మరో పదిమందికి స్వల్పగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను జనరల్ ఆస్పత్రికి తరలించారు. విషయంపై ఎస్‌ఐ మాట్లాడారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ఆస్పత్రి వద్దకు వచ్చారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

పండుగ కోసం గ్రామానికి వస్తూ..

మద్దూరు: దసరా పండుగ కోసం సొంత గ్రామానికి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన.. వికారాబాద్ జిల్లాలోని బొంరాస్‌పేట మండలంలోని మెట్లకుంట చెక్‌పోస్టు వద్ద చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మద్దూరు మండలంలోని చింతల్‌దిన్నెకు చెందిన మొగులప్ప(32) కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో వలస కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో దసరా పండుగ కోసం తన ద్విచక్ర వాహనంపై సొంత గ్రామానికి బయలుదేరాడు. మెట్లకుంట తండా దగ్గర సంగారెడ్డి జిల్లాలోని శంకర్‌పల్లికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుని వాహనం అడ్డంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వాహనాదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా తీవ్ర గాయాలతో పడి ఉన్న మొగులప్పను ఆస్పత్రికి తరలించడంలో అలసత్వం వహించారని.. దీంతో అతడు అక్కడే మృతిచెందాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. అతడి తండ్రి శాంతప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎండీ రహూఫ్ వివరించారు. మొగులప్పకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలైన ఘటనలు ఇటిక్యాల పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకున్నాయి. ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. కర్నూల్ నుంచి మెదక్ వెళ్తున్న ఓ హార్వెస్టర్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ డీసీఎం ఎర్రవల్లి పోలీస్ పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై అర్ధరాత్రి.. అతివేగంతో వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ఇరు వాహనాలు పూర్తిగా నుజ్జు నుజ్జు అయ్యాయి. కాగా ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. అదేవిధంగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును.. హైదరాబాద్ నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఓ డీసీఎం వాహనం జాతీయ రహదారిపై విజయ ఆయిల్ మిల్లుకు ఎదురుగా అతివేగంతో ఢీకొట్టింది. ఘటనలో బస్సు వెనుకభాగం, డీసీఎం ముందు భాగం పూర్తిగా నుజ్జు నుజ్జు అయ్యాయి. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటనలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

మిడ్జిల్: వాడ్యాల్‌కి చెందిన బొర్ర కృష్ణయ్య(47) చికిత్స పొందుతూ మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఆయన శనివారం బైక్‌పై కల్వకుర్తి వెళ్లి తిరిగి గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో మిడ్జిల్ బస్టాండ్ దగ్గర బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో చికిత్స నిమిత్తం ఆయనను జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన ఆదివారం మృతి చెందాడు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

కేఎల్‌ఐ కాల్వలో పడి వ్యక్తి గల్లంతు

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): మండలంలోని మంగనూర్ గ్రామ సమీపంలోని కేఎల్‌ఐ కాల్వలో పడి ఒక ద్విచక్ర వాహనదారు గల్లంతయ్యాడు. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నందివడ్డెమాన్‌కు చెందిన రాముడు (35) గౌరారంలోని తన అత్తారింటికి విజయదశమి వేడుకల కోసం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మంగనూర్ కేఎల్‌ఐ బ్రిడ్జి వంతెనపై వాహనం అదుపు తప్పి కాల్వలో పడ్డాడు. కాల్వలో నీటి ఉధృతికి క్షణాల్లో కొట్టుకుపోయాడు. ఇప్పటివరకు ఆచూకీ లభించలేదు. బంధువులు, అధికారులు రాముడి కోసం గాలిస్తున్నారు.

బావిలో పడి యువకుడి మృతి

కోస్గి: దసరా పండగ సందర్భంగా ఆటోను కడిగేందుకు వెళిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన గుండుమాల్ మండలం హన్మాన్‌పల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. హన్మాన్‌పల్లికి చెందిన కావలి మల్లేష్ (32) ఆటో నడుపుతూ జీవనం కొనసాగించేవాడు. దసరా పండగ నేపథ్యంలో ఆటోను కడిగేందుకు గ్రామ శివారులో చెరువును ఆనుకొని ఉన్న రేండ్లోని బావికి వెళ్లాడు. ఆటోను కడుగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో జారీ పడ్డాడు. రాత్రి అయినా అతడు ఇంటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు బావి వద్ద వెళ్లి చూడగా.. ఆటో, బకెట్ ఒడ్డున కనిపించాయి. అతడి కోసం బావిలో గాలించినా ఫలితం లేకపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది సహాయంతో బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై వేడి నూనెతో దాడి!


నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

మానవపాడు: చిన్నపోతులపాడులో మహిళపై వేడినూనెతో దాడిచేసిన ఘటన ఈ నెల 10న చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రశాంతమ్మ 10వ తేదీన ఇంటిదగ్గర బండిపై బజ్జీలు చేస్తోంది. ఈ క్రమంలో ఇంటి పక్కనే ఉన్న యుగంధర్, సత్తి, అరుణమ్మ ఇక్కడ బజ్జీలు ఎందుకు అమ్ముతున్నావని ఆమెతో తగువు పెట్టుకున్నారు. దుర్భాషలాడుతూ బజ్జీల వేడినూనెతో దాడి చేశారు. దీంతో ప్రశాంతమ్మ గాయపడి.. కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు నమోదు చేశారు. కాగా ఆదివారం పోలీస్‌స్టేషన్ వద్ద ఎంఆర్‌పీఎస్ అలంపూర్ ఇంచార్జి జయరాజ్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బాధ్యులపై అటెంప్ట్ టు మర్డర్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పండగ వేళ విషాదం

- నీటిగుంతలో పడి ఇద్దరు అన్నదమ్ముళ్ల మృత్యువాత
- మూసాపేట మండలం సూర్తితండాలో విషాదం

అడ్డాకుల: పొలం వద్ద ఉన్న మేకను తీసుకువచ్చేందుకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ముళ్లు ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి మృత్యువాత పడ్డారు. ఈ విషాదకర ఘటన మూసాపేట మండలం సూర్తితండాలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. సూర్తితండాకు చెందిన నానావత్ సక్రూ నాయక్, జ్యోతి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు సాయి నాయక్(13) 8వ తరగతి, చిన్న కుమారుడు సాకేత్ నాయక్ (9) 4వ తరగతి చదువుతున్నారు. సక్రూ నాయక్ ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. దసరా పండగ రోజు (శనివారం) సాయంత్రం 5 గంటల సమయంలో పొలం వద్ద ఉన్న మేకను ఇంటికి తీసుకురావడానికి అన్నదమ్ముళ్లు సాయి నాయక్, సాకేత్ నాయక్ వెళ్లారు. పొలం సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న నీటిగుంతలో ప్రమాదవశాత్తు చిన్నారులు పడి మునిగిపోయారు. అయితే పొలం వద్దకు వెళ్లిన చిన్నారులు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు.. పొలం వద్దకు వెళ్లి వెతికారు. నీటి గుంత వద్ద చిన్నారుల చెప్పులు కనిపించడంతో నీటిలోకి దూకి వెతకగా ఇద్దరు చిన్నారులు కనిపించారు. వారిద్దరిని బయటకు తీయగా.. పెద్ద కుమారుడు సాయినాయక్ అప్పటికే మృతిచెందాడు. చిన్న కుమారుడు సాకేత్ నాయక్ కొన ప్రాణంతో ఉండగా.. బైక్‌పై ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు వదిలాడు. ఈ ఘటనతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పండగ పూట ఇద్దరు కుమారులు దుర్మరణం చెందడంతో వారి రోదనలు అందరినీ కలిచివేశాయి. దసరా పండగ కోసం ముస్తాబైన తండావాసులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని చిన్నారుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.శ్రీనివాసులు తెలిపారు.



సాకేత్‌నాయక్ (ఫైల్)


సాయినాయక్ (ఫైల్)

చెక్‌డ్యాంలో పడి మరో బాలుడు..

తాడూరు: ప్రమాదవశాత్తు చెక్‌డ్యాంలో పడి బాలుడు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తాడూరుకు చెందిన జగన్ (12) స్థానిక అయ్యప్ప దేవాలయం సమీపంలో ఉన్న పొలం వద్దకు వెళ్తూ.. ప్రమాదవశాత్తు చెక్‌డ్యాంలో పడ్డాడు. పొలానికి వెళ్లిన బాలుడు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. చివరకు చెక్‌డ్యాంలో శవమై కనిపించడంతో కన్నీరు మున్నీరయ్యారు. పండగ వేళ బాలుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

క్లుప్తంగా...



సీఎం చంద్రబాబును కలిసిన చిరంజీవి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సినీ నటుడు చిరంజీవి శనివారం హైదరాబాద్‌లో కలిశారు. వరద బాధితుల సహాయార్థం రూ.కోటి చెక్కు అందజేశారు. ఇటీవలి వరదల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు మెగాస్టార్ చిరంజీవి, ఆయన తనయుడు రామ్ చరణ్ కలిసి తలో కోటి రూపాయల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం చిరంజీవి తన రూ.50 లక్షల చెక్కుతో పాటు రామ్ చరణ్ రూ.50 లక్షల చెక్కును.. మొత్తం కోటి రూపాయల చెక్‌లను అందజేశారు.

– సాక్షి, హైదరాబాద్

డీకేజెడ్ టెక్నాలజీ స్కాంపై ఈడీ విచారణ

హవాలా, మనీలాండరింగ్ జరిగినట్లు గుర్తింపు



సాక్షి, హైదరాబాద్: వివిధ రకాల స్కీముల పేరుతో, అధిక వడ్డీ ఆశ చూపి భారీ కుంభకోణాలకు పాల్పడిన డీకేజెడ్ కంపెనీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆరా తీస్తున్నారు. సదరు సంస్థ మొత్తం 17,500మంది బాధితుల నుంచి రూ.229 కోట్లు వసూలు చేశారు. ఈ భారీ మోసం కేసులో కీలక నిందితులను హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు ఇటీవలే అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మరికొందరు నిందితుల కోసం సీసీఎస్ పోలీసులు గాలిస్తున్నాయి. అయితే డీకేజెడ్ సంస్థ కొల్లగొట్టిన సొమ్ముతో మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. అదేవిధంగా పెద్ద మొత్తంలో హవాలా జరిగినట్లు ప్రాథమికంగా ఆధారాలు లభించడంతో ఈడీ రంగంలోకి దిగింది.

చక్రస్నానంతో సేద తీరిన స్వామి

ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలకు వీడ్కోలు

తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిశాయి. 9వ రోజు శనివారం ఉదయం 3 గంటల నుంచే పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవంతో స్వామివారు వరాహస్వామి ఆలయానికి చేరుకున్నారు. 9 రోజులపాటు వివిధ వాహనాల్లో ఊరేగిన అలసిసొలసిన స్వామి..స్నపన తిరుమంజనం సేవలో సేద తీరారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ గర్భాలయంలోని మూలమూర్తి అంశమైన సుదర్శన చక్రాత్ అళ్వార్‌కు పుష్కరిణిలో పవిత్ర స్నానం చేయించారు. బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల మధ్యలో ఆగమ శాస్త్రోక్తంగా గరుడపతాకాన్ని కిందకు దించి బ్రహ్మోత్సవాలను ముగించారు. చక్రస్నానంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప పాల్గొన్నారు.



పుష్కరిణిలో చక్రస్నానాన్ని ఆచరిస్తున్న దృశ్యం

వైభవంగా 'భాగ్‌సవారి'ఉత్సవం

తిరుమలలో ఆదివారం సాయంత్రం భాగ్‌సవారి ఉత్సవాన్ని టీటీడీ నిర్వహించింది. స్వామివారి ఉత్సవమూర్తులను తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ అనంతాళ్వారు తోటకు వేంచేశారు. బ్రహ్మోత్సవాలు పూర్తయిన మరుసటి రోజు తిరుమలలో 'భాగ్‌సవారి'ఉత్సవం నిర్వహిస్తారు.

ఇంద్రకీలాద్రిపై ముగిసిన దసరా మహోత్సవాలు

చివరి రోజు శ్రీ రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారి దర్శనం


వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజైన విజయదశమి రోజున దుర్గమ్మ శ్రీ రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. శనివారం ఉదయం చండీహోమం మండపంలో పూర్ణాహుతితో రుత్వికులు ఉత్సవాలకు ముగింపు పలికారు. శనివారం, ఆదివారాలు ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కూడా అమ్మవారికి అదే అవతారాన్ని కొనసాగించారు. ఉత్తరాంధ్ర నుంచి భారీగా వచ్చిన భవానీలతో విజయవాడ పరిసర ప్రాంతాలు కిక్కిరిసాయి. విజయదశమి సాయంత్రం దుర్గమ్మను కృష్ణానదిలో తెప్పోత్సవం పేరుతో హంసవాహనంపై విహరింపజేస్తారు. ఈ ఏడాది నదిలో 40–50 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతుండటంతో తెప్పోత్సవానికి నీటిపారుదల శాఖ నుంచి అనుమతి లభించలేదు. దీంతో దుర్గాఘాట్‌లోనే హంసవాహనంపై గంగా సమేత శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్లను అధిష్ఠింపజేసి వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.



చంద్రబాబు ఆరోపణల వెనుక

కుట్ర కోణం

ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ డాక్టర్ సుబ్రమణ్యస్వామి



- శ్రీవారి ప్రసాదం కల్తీ అయిందని ఏ ఆధారంతో చెబుతారు?
- జూలైలో నివేదిక వస్తే సెప్టెంబర్ దాకా ఏం చేశారు?
- దర్యాప్తు చేయకుండా కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఎలా ప్రకటిస్తారు?
- సుప్రీంకోర్టును సైతం కలవరపెట్టే ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి
- ఏపీ సిట్‌తో వాస్తవాలు బయటపడవనే సుప్రీంకోర్టు జోక్యం కోరాను

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదే పదే ప్రకటించడం వెనుక కుట్ర కోణం ఉందని ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి పేర్కొన్నారు. ఎలాంటి ఆధారం లేకుండా లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిందని ఆరోపించడం ప్రపంచాన్ని కలవర పెట్టిందని అన్నారు. ప్రజల మనోభావాలను ప్రభావితం చేసే ఇలాంటి అంశాలను బహిరంగంగా ప్రకటించే ముందు దర్యాప్తు చేయాలన్నారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన తిరుమల లడ్డూపై వచ్చిన ఆరోపణలపై పలు ప్రశ్నలు లేవనెత్తారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి క్రైస్తవ ముద్ర వేసేందుకు చేసిన సందర్భాలను సైతం ఆయన ఇక్కడ గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మీడియా సంస్థల బాధ్యతారాహిత్యాన్ని ఎత్తిచూపారు. ఏపీ ప్రభుత్వం నియమించిన సిట్‌తో వాస్తవాలు తేలవని, అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించినట్టు చెప్పారు. ఆ ఇంటర్వ్యూలో ఆయన ఇంకా ఏమన్నారంటే..

> నెయ్యి శాంపిల్స్ పరీక్షలు చేసి, టీటీడీ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడంతో వెనక్కు పంపించామని టీటీడీ ఈవో రిపోర్టులో స్పష్టంగా ఉన్నప్పటికీ, కల్తీ జరిగిందని సాక్షాత్తు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పదే పదే బహిరంగంగా ప్రకటించడం దేనికి నిదర్శనం? ఇలా ఆరోపణలు చేశాక దర్యాప్తుకు ఆదేశిస్తారా? నిజానిజాలు నిర్ధారించుకోకుండా భక్తుల్లో అలజడి సృష్టించడానికి యత్నించడం కుట్ర కోణంగా భావించక తప్పదు.
>
> – ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ డాక్టర్ సుబ్రమణ్యస్వామి

జగన్ సీఎం అయినప్పటి నుంచి ఇదే వైఖరి

- తిరుమల బాలాజీ లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని స్వయంగా ముఖ్యమంత్రే గత నెల 18న బహిరంగంగా ఆరోపించారు. ఆ తర్వాత ప్రసాదం కల్తీపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను నియమిస్తున్నట్టు సెప్టెంబర్ 26న ప్రకటించారు. ఇలాంటి తీవ్రమైన ఆరోపణ చేసేటప్పుడు సీఎం స్థాయిలో ఉన్న వారు వాస్తవమా.. కాదా అని తొలుత దర్యాప్తు చేసి నిర్ధారించుకోవాలి.
- కానీ ఇక్కడ అలా జరగలేదు. ముందు ఆరోపణ చేసి తర్వాత సిట్ దర్యాప్తు అన్నారు. పైగా కల్తీపై దర్యాప్తు కోసం అదే ప్రభుత్వం సిట్‌ను నియమించడం ద్వారా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అనుకోవడం లేదు. జూలైలో కల్తీ జరిగిందని చెప్పి.. ఇంత కాలం తర్వాత ఇప్పుడు ఎందుకు సిట్‌ని నియమించారు? పైగా గత ప్రభుత్వంపై, నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన మంత్రులపై చాలా పెద్ద ఆరోపణలు చేశారు.
- జగన్ సీఎం అయినప్పటి నుంచి తిరుపతిలో క్రైస్తవ మత ప్రచారం చేస్తున్నారని ఓ ప్రణాళిక ప్రకారం ఆరోపణలు చేస్తూ వచ్చారు. తద్వారా నాటి సీఎం వైఎస్ జగన్‌పై మత ముద్ర వేసేందుకు చాలా ప్రయత్నం చేశారు. 2019లో సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినప్పుడు కూడా ఇదే రకమైన ఆరోపణలు చేశారు. ఒక క్రైస్తవుడిని టీటీడీ చైర్మన్‌గా ఎలా నియమిస్తారని హిందూవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- వాస్తవమేంటంటే సుబ్బారెడ్డి గురించి తెలిసిన వారిని ఎవరిని అడిగినా ఆయన హిందువనే చెబుతారు. ఆయన 32 సార్లు మాల వేసుకుని శబరిమలకు వెళ్లివచ్చారు. ఇంట్లో గోశాల నిర్వహిస్తూ గోవులకు పూజ చేస్తున్నారు. ఇప్పుడు లడ్డూ ప్రసాదం కల్తీ జరిగిపోయిందని చంద్రబాబు నాయుడు పత్రికల్లో పతాక స్థాయిలో స్టేట్‌మెంట్లు ఇచ్చారు. ఇలాంటివి చాలానే ఉన్నాయి. ఇందులో సుప్రీంకోర్టును సైతం కలవరపెట్టే అంశాలు చాలా ఉన్నాయి. అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించాను. ప్రస్తుతం ఈ అంశంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ప్రత్యేక సిట్‌ను నియమించింది.

తప్పుడు వార్తలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జూలైలో నెయ్యి శాంపిల్ తీసుకుని టెస్ట్ చేశారని టీటీడీ రిపోర్టులో ఉంది. ఆ రిపోర్టులో కల్తీ జరిగిందని గానీ, ఫిష్ ఆయిల్, కొవ్వు కలిసిందని గానీ ఎక్కడా లేదు. నెయ్యి నాణ్యత టీటీడీ ప్రమాణాలకు తగ్గట్టుగా లేనందున తిప్పి పంపించామని ఉందే తప్ప ప్రసాదం తయారీకి పంపించామని ఎక్కడా చెప్పలేదు. కాబట్టి ఒక అబద్ధాన్ని సృష్టించి.. విస్తృతంగా ప్రచారం చేశారన్నది వాస్తవం. ఇలాంటప్పుడు కల్తీ జరిగిందని ఎలా చెబుతారు? ప్రసాదంపై చేసిన ఆరోపణ కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేసేది. ఆరోపణలు చేయడం సులువే, కానీ వాటిని నిరూపించాలిగా!
- వార్తాపత్రికలు కూడా జవాబుదారీగా ఉండాలి. రాజకీయ నాయకులు లడ్డూ ప్రసాదం, ఆలయ అంశాలను సమస్యగా మార్చి తమ గ్రాఫ్ పెంచుకునే ప్రయత్నం చేయవద్దని సుప్రీంకోర్టు గట్టిగానే చెప్పింది. ఈ హెచ్చరికను ప్రజలు ప్రశంసించారు. ఒకరి గుర్తింపును, ఎదుగుదలను రాజకీయంగా నాశనం చేసేందుకు తప్పుడు వార్తలను ప్రచారం చేసే ఏజెన్సీలు సైతం ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

మాంసం ముక్క గొంతులో ఇరుక్కొని వ్యక్తి మృతి



కాకి వెంకటన్న (ఫైల్)

మదనాపురం: మాంసం ముక్క గొంతులో ఇరుక్కొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కొన్నూరులో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కాకి వెంకటన్న (50) కుటుంబం శనివారం దసరా పండుగను సంతోషంగా జరుపుకొంది. ఆదివారం మధ్యాహ్నం వెంకటన్న కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తుండగా మాంసం ముక్క గొంతులో ఇరుక్కుని శ్వాస ఆడక అక్కడే నేలకొరిగాడు. వెంటనే బంధువులు కొత్తకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి వివరించారు. ఈ ఏడాదిలోనే గోవిందహళ్లిలో గుడ్డు గొంతులో ఇరుక్కుని తిరుపతయ్య అనే వ్యక్తి మృతిచెందాడు.

పక్షవాతానికి వైద్యం చేసిన ఇద్దరిపై కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: ఆయుర్వేదం వైద్యుడినని చెప్పి పక్షవాతం బాగు చేస్తానని ఓ వ్యక్తికి వైద్యం చేయగా ఆ వైద్యం కాస్త వికటించింది. దీంతో బాధితుడు తీవ్ర నొప్పితో ఇబ్బందిపడటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనకు సంబంధించి మహబూబ్‌నగర్ రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని భగీరథకాలనీలో నివాసం ఉండే ఓ మాజీ ప్రజాప్రతినిధికి ఆరేళ్ల కిందట పక్షవాతం వచ్చింది. అయితే పట్టణానికి చెందిన ఓ జర్నలిస్ట్ అతనికి తెలిసిన చంద్రారెడ్డి అనే వ్యక్తిని భగీరథకాలనీలో ఉన్న మాజీ ప్రజాప్రతినిధి ఇంటికి తీసుకువెళ్లి ఇతను ఆయుర్వేద వైద్యుడని పక్షవాతానికి వైద్యం చేసి త్వరగా తగ్గిస్తాడని నమ్మించాడు. దీంతో సదరు ప్రజాప్రతినిధి శరీరంపై చంద్రారెడ్డి అతని వెంట తెచ్చుకున్న కొన్ని రకాల రసాయనాలను పూశారు. మరసటి రోజు ఉదయం శరీరం మొత్తం మంట, రక్త స్రావంతో బొబ్బలు వచ్చాయి. దీంతో బాధితుడు నకిలీ వైద్యంతో మోసం చేశారని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చంద్రారెడ్డితోపాటు జర్నలిస్ట్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగాలు వచ్చేనా..?



శ్రీశైలం ప్రాజెక్టులో ముంపునకు గురవడంతో పునర్నిర్మించిన మంచాలకట్ట గ్రామం

- ఏళ్లతరబడిగా అమలుకు నోచుకోని జీఓ 98 బాధితులు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న శ్రీశైలం ముంపు నిర్వాసితులు
- ప్రాజెక్టు నిర్మాణంతో సర్వం కోల్పోయిన 67 గ్రామాల ప్రజలు

పెంట్లవెల్లి: శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంతో దాదాపు 67 గ్రామాలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాయి. దీంతో అప్పటి ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిర్వాసితుల కోసం జీఓ 98, 69లను ప్రత్యేకంగా కేటాయించి ఉద్యోగాలు, నష్టపరిహారం అందిస్తామని ప్రకటించాయి. ఇంటికో ఉద్యోగం, భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇప్పిస్తామని జీఓలు తీసుకువచ్చిన ఫలితం లేకుండాపోయింది. నాలుగు శతాబ్దాలు గడిచినా నిర్వాసితులకు మాత్రం పూర్తిస్థాయిలో ఉద్యోగాలు కల్పించలేదు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలు జీఓలు జారి చేసిన ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారుతున్నా కానీ, వారికి న్యాయం జరగడం లేదని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల హామీగా..

శ్రీశైలం నిర్వాసితుల గోడు ప్రజాప్రతినిధులకు ఎన్నికల హామీగా మారిపోయింది. ప్రతిసారి ఎన్నికల సమయంలో వీరికి న్యాయం చేస్తామని హామీలిస్తూ.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. ప్రతిసారి ఎమ్మెల్యేలు.. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప హామీలు అమలుకు నోచుకోవడం లేదని నిర్వాసితులు వాపోతున్నారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 30 మందికి, కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో 128 మందికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇచ్చారు.

మంత్రి సొంత నియోజకవర్గం..

రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత నియోజకవర్గం కావడంతో కొందరు నిర్వాసితులకు అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఉద్యోగాలు రావడం జరిగింది. ప్రస్తుతం కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం, మంత్రిగా జూపల్లి కృష్ణారావు పనిచేస్తుండటంతో.. మళ్లీ కొందరికైనా ఉద్యోగావకాశాలు లభిస్తాయని నిర్వాసితులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సర్వం కోల్పోయాం..



శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంతో ఉన్న ఇల్లు, పొలాలు మునిగిపోయి సర్వం కోల్పోయాం. ఈ ప్రాజెక్టుతో మాకు, మా కుటుంబాలకు ఎంతో అన్యాయం జరిగింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు లేదా నష్టపరిహారం ఇచ్చి న్యాయం చేయాలి.

– కుర్మయ్య, మాధవస్వామినగర్

మంత్రి చొరవ చూపాలి..



శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంతో ఆస్తులు, ఇల్లు, భూములు అన్నీ ముంపునకు గురై కట్టుబట్టలతో మిగిలాం. అప్పట్లో మా తల్లిదండ్రులకు ఇస్తామన్న ఉద్యోగాలు.. కనీసం ఇప్పుడు మాకైనా ఇప్పించాలని ఆశతో ఎదురుచూస్తున్నాం. ఈ విషయంలో స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకొని ఉద్యోగాలు వచ్చేలా చూడాలి.

– విష్ణు, మల్లేశ్వరం

యువకుడి హఠాన్మరణం




ధర్మారెడ్డి (ఫైల్)

అమరచింత: మండలంలోని మిట్టనంది మళ్లలో ఓ యువకుడు ఆకస్మికంగా మృతిచెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. శనివారం సాయంత్రం గ్రామంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు పలానా వీధుల మీదుగా వెళ్లాలని కొందరు.. వద్దని మరికొందరు యువకులు ఘర్షణ పడ్డారు. ఇరువర్గాలు ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆదివారం ఉదయం వస్తామంటూ తిరిగి ఇంటికి వెళ్లిపోయారు. ఘర్షణతో మనస్తాపానికి గురైన నేష ధర్మారెడ్డి (32) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. ధర్మారెడ్డి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తాడని.. పండుగలకు గ్రామానికి వచ్చి వెళ్తుంటాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

కేఎల్‌ఐ కాల్వకు గండి

మండలంలోని జూపల్లి శివారులో కేఎల్‌ఐ డీ–82 కాల్వ శుక్రవారం రాత్రి కోతకు గురైంది. వారం రోజులుగా నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రధాన కాల్వకు 15 కి.మీ. దూరంలో డీ–8 కాల్వ కోతకు గురికావడంతో మొక్కజొన్న, వరిపంటలను నీరు ముంచెత్తింది. సుమారు 20 ఎకరాల పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. విషయం తెలుసుకున్న అధికారులు శనివారం మరమ్మతు పనులు చేపట్టారు. సకాలంలో అధికారులు స్పందించి, కాల్వ గండిని పూడ్చివేయడంతో ఆయకట్టు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాల్వ నీరంతా జూపల్లి చింతచెరువు, తూంచెరువుల్లోకి చేరడంతో నిండుకుండలా మారాయి.

– చారకొండ



జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో



సుంకేసుల నుంచి దిగువకు పారుతున్న వరద నీరు

- ప్రాజెక్టుకు 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- జెన్‌కో జల విద్యుత్ కేంద్రాల్లో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు/ దోమలపెంట/ రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 8 గంటల వరకు 45 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. దీంతో జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి కొనసాగిస్తున్నారు. ఇందుకోసం 37,480 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, సమాంతర కాల్వకు 400, భీమా లిఫ్టు– 2కు 750 క్యూసెక్కులు వదలగా.. మరో 92 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.830 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా.. ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. ప్రాజెక్టుకు 55 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో 14 గేట్లను ఎత్తి 62,480 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 32.984 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మరో రెండు రోజుల్లో నారాయణపూర్ నుంచి విడుదలవుతున్న వరద నీరు జూరాలకు చేరే అవకాశం ఉంది.

సుంకేసులకు భారీగా వరద

సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వస్తున్న వరద ఆదివారం భారీగా పెరిగింది. ఎగువ నుంచి 69,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 16 గేట్లను ఎత్తి 67,312 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. అలాగే కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.

శ్రీశైలంలో 881.6 అడుగులు..

శ్రీశైలం జలాశయానికి ఎగువనున్న జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,480 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 67,312 మొత్తం 1,04,792 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుంది. దీంతో శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 18,833 మొత్తం 54,148 క్యూసెక్కుల నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 10,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,561, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 210 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 881.6 అడుగుల వద్ద 197.0114 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని వేగవంతంగా కొనసాగుతుందని జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు అన్నారు. ఈ ఏడాది ఎగువ, దిగువల్లో 600 మిలియన్ యూనిట్ల టార్గెట్ ఉండగా చేరువలో ఉన్నామన్నారు. ఇప్పటి వరకు ఆయా కేంద్రాల్లో 500.600 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని చెప్పారు. వరద నీరు ఇదేస్థాయిలో కొనసాగితే ఈ ఏడాది వందశాతం లక్ష్యానికి చేరుకుంటామన్నారు. అయితే ఆదివారం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. కార్యక్రమంలో డీఈలు పవన్‌కుమార్, రాజు, రూపేష్, ఈఈ దర్బార్‌వలీ, సిబ్బంది పాల్గొన్నారు.



దిగువ జూరాల విద్యుదుత్పత్తి కేంద్రం